

# అనగనగా... ఒక కథ

బ్నిం

# ఏం కావాలి ???

స్వర్ణ ఆఫీసు నుంచి బయల్దేరేటప్పటికి ఎనిమిదవుతోంది. శీతాకాలం చీకటి చిక్కగా ఉంది. ఈపాటికి ఆయనగారు ఆఫీసుకి వెళ్లిపోయుంటారు. పిల్లల గురించి కంగారు పడుతోంది. సెల్ నుంచి ఫోను చేద్దాం అంటే లోబేట్రీ లైన్లు.... అట్టడుగుకి వెళ్లిపోయాయి. ప్రతీ పబ్లిక్ ఫోను దగ్గరా నలుగురైదుగురు వెయిట్ చేస్తూ కనిపిస్తున్నారు. అక్కడ ఆగి వెయిట్ చేసి మాట్లాడే బదులు తనే ట్రాఫిక్ జామ్ లేని అడ్డదార్ల గుండా... కాస్త వేగంగా ఇంటికి జేరిపోవచ్చు.

పిల్లలిద్దరూ స్కూల్ నుంచి వచ్చేటప్పటికి... ఇంటి దగ్గర ఉండాలని ఎంత ప్రయత్నించినా ఇలా స్పెషల్ మీటింగ్‌లున్నప్పుడు ఆలస్యమే అవుతుంది. భర్తది నైట్ డ్యూటీ. సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉద్యోగం. కెరియర్ ఇంపార్టెన్స్ అనుకునేవాళ్లు.... భర్తని భార్యా, భార్యని భర్తా.. ఇద్దరూ పిల్లల్ని చాలా మిస్సవుతారు. అయితే మధ్య తరగతికి కొంచెం తక్కువలో ఉండే వాళ్లు.. ఇవ్వాళ భార్యాభర్తలిద్దరూ కలిపి 70 వేలు దాకా సంపాదించుకుంటున్నారంటే.... ఆ పోరాటం.. ఆ విజయం... ఆ తృప్తీ... ఆ కసీ... ఆ పట్టుదలా.. పెరిగే కోరికా పెరిగి, సుఖాలూ సంతోషాలూ ఏం కోల్పోతున్నా లక్ష్య పెట్టరు. స్వర్ణ, సుకుమార్ కూడా అంతే.

ధనమూల మిదం జగత్ అన్న మహానుభావుడు కూడా మధ్యతరగతి నుంచో అంతకన్నా కింది తరగతి నుంచో ఎదుగుతూ అన్నమాటే - లేదా.. దిగుతూ అనుకున్న మాటే.. అని సెలవురోజుల్లో ఒకళ్లనొకళ్లు ఓదార్చుకుంటూ... పెద్ద ఇల్లు కొనుక్కోవాలని అందుకోసం ఎన్నాళ్లు కష్టపడాలో ప్రణాళికలు వేసుకుంటారు!!

ఇప్పటికే సుకుమార్ ఇన్‌స్టాల్‌మెంట్‌లో కారు కొనుక్కున్నాడు.

స్వర్ణ తన కెనటిక్ హోండాని వేగం పెంచుతోంది! మళ్లీ భయంతో తగ్గిస్తోంది. తనకి పదిహేను వేలు జీతం. వచ్చే ఏడాది కంపెనీ ఇంకో 5 వేలు పెంచుతుంది. ఈలోగా వేరే ఏడేజెన్సీకి జంప్ చేస్తే స్టార్టింగే 20 వేలతో జాబ్ రావచ్చు... కానీ ఇక్కడ.. తనకుండే పలుకుబడీ, స్టాఫ్ అందరికీ ఉండే గౌరవం, మంచి కాప్షన్లు ఇచ్చే కాపీరైటరుగా బాస్‌కుండే అభిమానం... ఐదు వేలు జీతం ఎక్కువ వచ్చినా ఇవన్నీ అక్కడా ఇలా దక్కుతాయా అనుకునేది. కొన్ని కావాలంటే కొన్ని వదులుకోవాలి. ప్రస్తుతం ఇక్కడ బాగానే ఉంది. ఇంతకన్నా జోరుగా వెళ్లక్కర్లేదు మనసుకి నచ్చ చెప్పుకుంటోంది.

* * *

ఇంటికెళ్లేప్పటికి పెద్దకొడుకూ చిన్నకొడుకూ కల్సి ఇల్లంతా రణరంగం చేసిపెట్టారు. రంగం సిద్ధమైంది కదాని యుద్ధం కూడా చేశారు. చిన్నాడు పెద్దవాణ్ని కరిచి, మళ్లీ దెబ్బలు తినాలని వెరచి, బెడ్రూంలో దూరి తలుపేసుకున్నాడుట.

స్వర్ణకి కోపం రాలేదు వాళ్లిద్దరి మీద. తలుపు తట్టి చిన్నాని కూడా పిల్చి ఇద్దర్నీ సముదాయించింది... ఇద్దరికీ సంధి చేసింది. ముగ్గురూ కలిపి ఇల్లంతా సర్దేసుకున్నారు. ఓ కంచంలో అన్నం కలిపి ముద్దలు చేసి ఇద్దరికీ తినిపించేప్పటికి 10 అయింది.

"మరేం.. మీరు పెంద్రాళే పడుకోవాలి. నేను రాత్రంతా ఆఫీసు పని చేసుకోవాలి... సరేనా..."

"రాత్రంతా హోమ్‌వర్క్?"

"హోమ్‌వర్క్ కాదు... ఆఫీసు వర్క్" అని జోకులేస్తూ కథలూ గట్రా చెప్పి వాళ్లని నిద్రబుచ్చింది.

తను భోజనం చేసి పనిలో కూచుందామని కంప్యూటర్ ముందుకొచ్చేప్పటికి... రాయాల్సిన దాని ఆలోచనలకన్నా ఆవలింతలు ముందొచ్చాయి.

కాసేపు ఇటూ అటూ తిరిగింది!! ఆవలింతలు తగ్గటానికి.

'కుమార్‌కి ఫోను చేస్తే కాస్త రిలాక్సవ్వచ్చు'

సెల్‌కి ఫోను కొట్టింది.

"బిజీయా"

"ఫర్లేదులే చెప్పు.... నీకేంటి అంత ఆలస్యం అయింది?"

"చెప్పానుగా.. కేమెల్ సిమెంట్ ఇండస్ట్రీ వాళ్లు కొత్త కేప్షన్ చేస్తున్నారు. రేపు ప్రెజెంటేషన్ అన్నారు... వాళ్లతో మీటింగ్"

"ఓ...నువ్ నైట్ ఔట్ చేయాలేమో?"

"హవును ఇప్పుడే హావళింతలు మొదలయ్యాయి... ఎందుకు నవ్వుతావు? నువ్ పొద్దున్నే వచ్చి లంచ్ టైమ్ దాకా పడుకుంటావ్"

"నువ్ స్క్రిప్ట్ రాసి పెట్టు. నేను వచ్చాక టైప్ చేసి పెడతాను"

"ఏమక్కర్లేదు. నీ సంగతి నాకు తెల్సు. గుర్రుపెట్టుకుంటూ ఇంట్లోకొచ్చి షూ విప్పకుండానే మంచమ్మీద ఢమాల్ అయిపోతావు. నిన్ను నమ్ముకుంటే నా పని అయినట్లే. నేనే ట్రై చేస్తా. నిద్దరొస్తోందని నీకు ఫోన్ చేశా!"

"జోకొట్టాలనా?"

"కాదు.....జైకొట్టాలని!"

**"పరిగెట్టి పాలు తాగద్దమ్మా నిలబడి నీళ్లు తాగండి! వాడు మంచి ఉద్యోగమే చేస్తున్నాడుగా. నువ్వే పిల్లల ఆలనాపాలనా చూసుకో. తల్లి ఉద్యోగం అన్ని ఉద్యోగాల కన్నా గొప్పది. జీతాన్ని మించిన ఆనందం ఇస్తుంది" అని చెప్పినందుకు వాళ్లని నొప్పించి, మొగుణ్ని వప్పించి, సఫిల్‌గుడా నుంచి వారాసిగుడాకి మకాం మార్పించింది.**



"ఆల్దీ బెస్ట్!"

"థేంక్యూ"

"గుడ్‌నైట్"

"నో గుడ్‌నైట్. నో బెడ్ నైట్. వర్క్‌లోకెళ్తున్నా. మళ్లీ మధ్య మధ్యలో ఫోన్ చేస్తా!!"

"ఓకే"

సుకుమార్‌తో ఫోన్లో మాట్లాడాక కాస్త మత్తు వదిలింది స్వర్ణకి.

కంప్యూటర్ కీబోర్డు మీద వేళ్లు పరిగెడుతున్నాయి.

బుర్రలో పుడుతూన్న ఆలోచనల్తో వెనకముందాడుతూ స్క్రీన్ మీద వాక్యాలు పాకుతున్నాయి.

ఎనిమిది రకాల హెడ్‌లైన్స్. 15 రకాల బేస్‌లైన్స్ అల్లేసింది. బాడీ కాపీ కూడా రెండు రకాలు చేసింది. కంప్యూటర్ రూమ్ నుండి బెడ్ రూమ్‌కి వచ్చేప్పటికి తెల్ల వారుఝాము మూడయింది టైము.

పన్లో ఉన్నంతసేపూ నిద్ర ధ్యాసే లేదు. ఆశ్చర్యంగా బైటకి రాగానే కళ్లు బరువెక్కాయి. ఒక్కసారి సుకుమార్‌కి ఫోన్ చేసి ఆనందం షేర్ చేసుకుని, అభినందనలు అందుకుంది. ఎంత పగలు పడుకున్నాడని ఎద్దేవా చేసినా పాపం రాత్రంతా మెలకువగా ఉండి వర్క్ చేస్తున్న భర్తమీద జాలేసింది.

కొన్ని కావాలంటే కొన్ని వదులుకోవాల్సిందే. పిల్లల పక్కన చోటు చేసుకు పడు

కుంది. తెల్లారి 'సీడీ' తీసుకెళ్లి.. ఆర్టిస్ట్‌కి విజువల్స్ గురించి చెప్పి ఏడ్ పేజీలు తయారు చేయించాలి... లేఅవుట్ ఎలా ఉండాలి విజువల్స్ ఎలా ఉండాలి. స్వర్ణ ఆలోచనలో ఉం..డ..గా... ఎప్పుడు నిద్ర పట్టిందో తెలియదు!!

సుకుమార్ ఆరున్నరకి డూప్లికేట్ కీ ఓపెన్ చేసుకుని ఇంట్లోకొస్తాంటే మెలకువ వచ్చింది.

అతను ఫ్రెష్‌గానే... అంటే రోజూ లాగే ఉన్నాడు. తనే డల్‌గా నిద్రమత్తుగా ఉన్నానని తెలిసిపోయింది స్వర్ణకి.

నవ్వు ముఖాన్ని పులుముకుని భర్తతో బాటు పెద్ద బెడ్రూంకెళ్లింది.

"బ్రీఫ్ కేసులో బ్రోచెర్స్ ఉన్నాయి చూడు. ఇవ్వాళ మన సొంతపనికే ఎక్కువ టైము వినియోగించా" డ్రెస్ మార్చి లుంగీలోకి జారుతూ అన్నాడు భర్త.

'ఏమై ఉంటుందబ్బా' అనుకుని ఆత్రంగా బ్రీఫ్‌కేస్ తీసింది స్వర్ణ. అదిగో అవే...

"జనహిత, విజయభేరి, ప్రముఖ్య అపార్ట్‌మెంట్స్ బ్రోచెర్లు! వాటి వివరాలు, లోన్ ఫెసిలిటీ, ఇన్‌స్టాల్‌మెంట్ డిటైల్స్..అన్నీ ఉన్నాయి. నిర్ణయం- నిశ్చయం నీదే..."

"సాయంత్రం వచ్చాక చూస్తాన్లే.. ఇవ్వాళ నాకు బోల్డంత పని ఉంది. బోల్డంత అలిసిపోయాను. గంట క్రితమే నిద్దరట్టింది. నా కళ్లెలా ఉన్నాయో చూడు" సింపతీ కోరుతున్న చిన్నపిల్లలా అంది స్వర్ణ కళ్లు చేతి వేళ్లతో సాగదీస్తూ.

"నీ కళ్లకి నా దగ్గర మంచి మందు ఉంది" అంటూ సుకుమార్ దగ్గరకి తీసుకున్నాడు.

ఇంతలో పాలవాడు తలుపుకొట్టాడు. విడిపోయింది జంట!

పాలు కాచడం - కాఫీ కలపడం - పిల్లల్ని లేపడం-

ఈ హడావుడిలో పనమ్మాయి వచ్చి చేస్తేనే అయ్యే పన్లు కొన్ని బేలన్స్ ఉండిపోతున్నాయి. ఆ అమ్మాయి వచ్చి, కుక్కరూ పిల్లల టిఫిన్‌బాక్స్‌లూ కడిగివ్వాలి. కాసిన్ని కూరలు తరిగిచ్చేస్తే తను వాళ్లకి బేగ్‌లూ గట్రా సర్ది డ్రెస్ చేయించేది.

ఆ మహాతల్లి ఆ రోజు ఎగ్గొట్టినట్లే - బ్రెడ్డూపాలూ తినిపించి, పిల్లలకి స్నానాలు చేయించి రడీ చేసి ఆటో ఎక్కిస్తూ ఆటోడ్రైవర్‌కి ఇరవై రూపాయలు ఇచ్చింది స్వర్ణ. ఎక్కడన్నా పిల్లలకి టిఫిన్ కొనిపెట్టి బాక్స్‌లో పెట్టమని రిక్వెస్టు చేసింది.

తనమీద తనకే జాలేసింది. పిల్లలకి బైట టిఫిన్ కొనైనా, తనే బాక్స్‌లో సర్దనందుకు. సుకుమార్‌కి పొద్దున్నే రాగానే పని చెబితే ఏం బావుంటుంది. అయినా మాంచి నిద్రలో పడిపోయాడు పాపం!

ఎందుకు తనంత శ్రమపడుతున్నాడు.. కుటుంబం కోసమేగా.. టైము చూస్తే 9 అవుతోంది.

గబగబ రడీ అయి రాత్రి రడీ చేసుకున్నదంతా 'సీడీ' రాసుకుంది. భర్త దగ్గర్లో కాఫీ ఫ్లాస్క్ పెట్టేసి తుర్రుమంది ఆఫీసుకి.

* * *

గ్రాండ్ సక్సెస్! తను రాసిన కాప్షన్స్ కాపీ, సెలెక్ట్ చేసిన విజువల్స్ అన్నీ నచ్చేశాయి కేమెల్ సిమెంట్ ఛైర్మన్‌గారికి. బాస్ కూడా బైటపడిపోయి బ్రహ్మానందంతో అభినందించాడు. బాసులు మెచ్చుట అరుదు కదా!

ఇంకా మహదానందంతో ఇంటికి బయల్దేరింది. ఓ గంట ముందుగానే ఇంటికొచ్చి భర్తకీ విషయమంతా చెప్పాలి.




మధ్యలో రెండుసార్లు తనే ఫోన్ చేశాడు గానీ సీసీసీగారితో మీటింగ్‌లో ఉండటం మూలాన్నీ, బాస్‌తో డిస్కస్‌లో ఉండటం మూలాన్ని ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి పెట్టింది. బైటకి రాగానే ఫోన్ చేస్తే నో రెస్పాన్స్. లేదా మళ్లీ చెయ్యమని కంపెనీవాళ్ల హెచ్చరింపులు... 'అలాక్కానీ' అనుకుంది. ఇంకా ఆఫీసులన్నీ ముగియవు గనక ట్రాఫిక్ బాగానే ఉంది- సోమాజిగూడా నుంచి వారాసిగూడ రయ్యిన వచ్చేస్తుంది - ప్రొద్దుట సుకుమార్ ఇచ్చిన బ్రోచర్లు చూడాలి - మాదాపూర్...పంజాగుట్ట...శ్రీనగర్‌కాలనీ.. ఈ మధ్యలో అయితే తనకీ నాకూ దగ్గరే. ఇలా సాగుతున్న ఆలోచనలో అనాలోచితంగా ఇల్లు వచ్చేసింది.

'సుకుమార్ ఇంట్లోనే ఉన్నాడు. కారు బైటే ఉంది. గుడ్' అనుకుంటూ ఇంట్లోకి ప్రవేశించింది.

సుకుమార్ హాల్లో కూచున్నాడు. వళ్లో తలపెట్టుకుని సోఫాలో పడుకున్నాడు చిన్నా - వాడి నుదుటి మీద చన్నీళ్లగుడ్డ - గబగబ బేగూ చెప్పులూ విసిరేసి సోఫా దగ్గర కూలబడింది "ఏమైంది"

"జ్వరంట! స్కూలువాళ్లు కంగారుగా ఫోన్చేస్తే వెళ్లి తీసుకొచ్చాను. డాక్టర్‌కి చూపించాను. ఫ్లూ అన్నాడు. కంగారు పడక్కర్లేదు. మూడు రోజుల్లో తగ్గిపోతుంది అన్నాడులే" ఓదార్పుగా ధైర్యం చెప్పాడు సుకుమార్.

సుకుమార్ ఆఫీసుకి వెళ్లిపోతూ మందులు వాడవల్సిన టైమూ, మందులూ, డాక్టర్ ఫోన్ నెంబర్లూ.. ఇచ్చాడు.

రాత్రంతా చిన్నాడు జ్వరావస్థలు అన్నీ పడుతూనే ఉన్నాడు. ఏడుస్తున్నాడు.

కంగారు పడుతోంది స్వర్ణ. సుకుమార్ ఫోన్ చేస్తున్నాడు. ధైర్యం చెప్తున్నాడు.

అప్పుడు గుర్తొచ్చింది... ఇలాగే పెద్దాడి చిన్నప్పుడు వాడికి పెద్ద జ్వరం. టైఫాయిడ్ అన్నారు. అప్పుడు తనకి రెండో డెలివరీ టైము. దాదాపు నెల రోజులు నిద్రహారాలు మాని అత్తయ్యా మావయ్యా వాణ్ని కనిపెట్టుకున్నారు. తనకెంత ధైర్యం చెప్పారని...!!

పెద్దవాళ్లతో ఉంటే తమ ఆశలకీ..ప్లాన్లకీ... పొదుపుకీ...నీతి వాక్యాలతో అడ్డుగోడలు పెడుతున్నారని విడిగా... ఇలా.. వచ్చేశాం. ఇప్పుడింకా వెలిగిపోవాలని... 'ఇంకా దూరం వెళ్లిపోదాం' అనుకుంటున్నాం.

"పరిగెట్టి పాలు తాగద్దమ్మా నిలబడి నీళ్లు తాగండి! వాడు మంచి ఉద్యోగమే చేస్తున్నాడుగా. నువ్వే పిల్లల ఆలనాపాలనా చూసుకో. తల్లి ఉద్యోగం అన్ని ఉద్యోగాల కన్నా గొప్పది. జీతాన్ని మించిన ఆనందం ఇస్తుంది" అని చెప్పినందుకు వాళ్లని నొప్పించి, మొగుణ్ని వప్పించి, సఫిల్‌గుడా నుంచి వారాసిగుడాకి మకాం మార్పించింది. ఇప్పుడు తల్లి ఉద్యోగం ఏ బాస్‌కో కాదు తనకే లాభమని తెలుస్తోంది. ఆ రాత్రి వేళ అత్తగారికి ఫోన్ చేసి ఏడ్చేసింది!

అత్తామావా ఫోనొచ్చిన గంటలో ఓ ముసలి 'లూనా' మీద కోడలింటికి వచ్చారు. పాపం సగం దూరం నడిచే ఉంటారేమో..వాళ్లతో 'మనం కల్సి ఉందామ'ని ప్రాధేయపడింది.

పిల్లల్ని మా దగ్గర ఉంచుకుంటామమ్మా అంటే.. "వద్దండీ నేనింక జాబ్‌కెళ్లను. మిమ్మల్నీ మీ అబ్బాయినీ మా అబ్బాయిల్నీ జాగ్రత్తగా చూసే మూడుద్యోగాలు చేస్తాను" అంది.

కోడలుద్యోగం, భార్య ఉద్యోగం, తల్లి ఉద్యోగం. ఒక ఉద్యోగంలో లేని తృప్తి ఆ తర్వాత స్వర్ణ పొందుతోంది. ఇన్ని కావాలనుకుంటే కొంత వదులుకుంటే ఏమనుకుంది స్వర్ణ.

☆